జనం గుండె చప్పుడై.. రాష్ట్రాభివృద్ధే అజెండా అయి..



ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న నాయకులు

- ఇదే వైఎస్సార్‌సీపీ జెండా లక్ష్యం..
- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: జనం గుండె చప్పుడై.. రాష్ట్రం అన్ని రంగాల్లో సర్వతో ముఖాభివృద్ధి చెంది ప్రజలు సుభిక్షంగా ఉండాలనే అజెండాతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కృతమైందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రతిపక్షంలో ప్రజల గొంతుకగా.. అధికార పక్షంలో ప్రజానాడీగా వైఎస్సార్‌సీపీ పయనం అప్రతిహతంగా కొనసాగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించి 12 ఏళ్లు పూర్తయి 13వ ఏడాదిలో అడుగిడిన సందర్భాన్ని పురస్కరించిన కావలిలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఆదివారం సంబరాలు నిర్వహించారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే నియోజకవర్గంలోని నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి, భారీ కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులతో ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి అయిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనతో రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. అయితే టీడీపీ కోసం, చంద్రబాబు కోసం ఎల్లో మీడియా కక్షతో సీఎం జగన్‌పై అనునిత్యం విషపు రాతలు రాస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని మండిపడ్డారు. దొంగ మీడియా సంస్థలు ఫేక్ వార్తలు ఎన్ని రాసినా సీఎం జగన్ భయపడే రకం కాదన్నారు. మరింత ఉత్సాహంతో జగన్ ప్రజలు ఆదరాభిమానులు పొంది రెండో సారి సీఎం కావడం ఖాయమన్నారు. కావలి నియోజకవర్గంలో కూడా ఎల్లో మీడియా టీడీపీ నాయకుల కుట్రలో భాగస్వామ్యంగా ఎన్ని సర్కస్ విన్యాసాలు చేసిన ప్రజలు నమ్మరన్నారు. రానున్న రోజుల్లో కావలి నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో, సీఎం జగన్ ఆశీస్సులతో కావలిని కనకపట్నం చేసి తీరుతామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, జనిగర్ల మహేంద్ర యాదవ్, గంధం ప్రసన్నాంజనేయులు, కుందుర్తి కామయ్య, షేక్ షాహుల్ హమీద్, మామిడి రామకృష్ణ, షేక్ నాయబ్ రసూల్, గంగనగారి యాదగిరి, పొనుగోటి అనురాధ, కొమారి రాజు, దామిశెట్టి సుధీర్, నాగనగారి శ్రీనివాసులుపాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

సీతారామపురం: మండలంలోని బసినేనిపల్లిలో వైఎస్సార్‌సీపీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం స్థానిక నాయకులు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్థాపించిన వైఎస్సార్‌సీపీ అనతి కాలంలోనే ఎనలేని ఆదరణ పొందిందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 సీట్లతో ప్రభంజనం సృష్టిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు బసిరెడ్డి కృష్ణారెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చప్పిడి తిరుపతి రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ బాలినేని మాబయ్య, నాయకులు దుబ్బిరెడ్డి సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, గుర్రపు సుబ్బయ్య, థామస్, చినరామయ్య, సతీష్, ప్రకాశం, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.



సీతారామపురం: బసినేనిపల్లిలో కేక్‌కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆత్మకూరు: ఎమ్మెల్యే కార్యాలయంలో వైఎస్సార్‌కు ఘన నివాళులర్పిస్తున్న నాయకులు

నాడు జనం కోసం జగన్.. నేడు జగన్ కోసం జనం

ఆత్మకూరు: నాడు జనం కోసం జగన్.. నేడు జగన్ కోసం జనం కోసం అజెండాగా వైఎస్సార్‌సీపీ జెండా ఎగురుతుందని పలువురు పార్టీ నాయకులు కొనియాడారు. పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి సూచనల మేరకు ఘనంగా నిర్వహించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, చైర్‌పర్సన్ జి.వెంకటరమణమ్మ నేతృత్వంలో పార్టీ జెండా ఆవిష్కరించి అనంతరం వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉదయగిరిలో...



ఉదయగిరి: కేక్‌కట్ చేస్తున్న నేతలు

ఉదయగిరి: ఉదయగిరి ట్యాంక్ బండ్‌పై ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల నేతలు ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఎగువ వేసి, కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో అక్కి భాస్కర్‌రెడ్డి, మూలే వినయరెడ్డి, జీ ఓబుల్‌రెడ్డి, జీ శ్రీనివాసరెడ్డి, ఎం.వెంకటసుబ్బారెడ్డి, గోగుల వెంగళరెడ్డి, ఖీల్జీ సలీం, మూలే వీరారెడ్డి, శ్రీను, గౌస్‌మొద్దీన్, వినయ్‌రెడ్డి, ఆర్.తిరుపతి, సంజీవరాజు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆదాయానికి రూ.లక్షల్లో గండి

- నిబంధనలకు విరుద్ధంగా కలప నరికివేతకు అనుమతి
- స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత



ఉదయగిరిలోని ఎగ్జిక్యూటివ్ కార్యాలయం

ఉదయగిరి: ఉదయగిరి ఇరిగేషన్ కార్యాలయంలోని ఓ ఉన్నతాధికారి నిబంధనలకు విరుద్ధంగా గండిపాళెంలో లోతట్టు ప్రాంతంలో రూ.లక్షల విలువ చేసే అపారమైన కలప (చిల్లకర్ర)ను తనకు అనుకూలమైన ఓ వ్యక్తికి లీజుకిచ్చి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టాడు. ఈ వ్యవహారాన్ని స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించడంతో వెలుగులోకొచ్చింది. ఉదయగిరి మండలం గండిపాళెంలో ఉన్న పాన్నెబోయిన చెంచురామయ్య జలాశయం లోతట్టు ప్రాంతంలో సుమారు 15 కి.మీ పైగా కలప విస్తారంగా ఉంది. ప్రస్తుతం చిల్లకర్రకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. దీంతో కన్నుపడిన ఒక కలప వ్యాపారస్తుడు కార్యాలయంలోని ఓ ఉన్నతాధికారితో ఒప్పందం కుదుర్చుకున్నాడు. వీరిరువురూ కలిసి లక్షలాది రూపాయలు విలువ చేసే చిల్లకర్రను నరికి పెద్ద మొత్తంలో ఆర్జించాలని పక్కా ప్లాన్ వేశారు. అందుకు తగ్గట్లుగానే జెట్టివారిపాళెం పరిసర ప్రాంతంలో చిల్లకర్రను అక్రమంగా నరికి విద్యుత్ ఫ్యాక్టరీలు, పొగాకు బ్యారన్లకు విక్రయిస్తున్నారు. ఈ వ్యవహారం గమనించిన మరికొంత మంది వ్యాపారస్తులు లోతట్టు ప్రాంతంలోని మరికొన్ని ప్రాంతాల్లో ఇదే వ్యవహారాన్ని కొనసాగిస్తున్నారు. గమనించిన స్థానికులు అక్రమంగా చిల్లకర్ర కొడుతున్న వ్యాపారస్తులను నిలదీయగా ఇరిగేషన్‌శాఖలో పనిచేసే ఓ ఉన్నతాధికారి తనకు అనుమతులు ఇచ్చినట్లు బుకాయిస్తున్నాడు. వాస్తవానికి వేలం పాటలో అధిక మొత్తంలో చేజిక్కించుకున్న వ్యక్తికి కలప దక్కే హక్కు ఉంటుంది. ఈ వ్యవహారంలో అలాంటి పరిస్థితి కనిపించలేదు. కేవలం తనకు అనుకూలమైన వ్యక్తికి మాత్రమే ఉన్నతాధికారి అనుమతి ఇచ్చినట్లుగా ప్రచారం చేసుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు విమర్శలున్నాయి. ఈ వ్యవహారంపై ఇప్పటికే స్థానికులు జిల్లా ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రస్తుతం విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. కేవలం చిల్లకర్రకే కాకుండా చెరువుల్లో మట్టి విక్రయాలకు కూడా నిబంధనలకు విరుద్ధంగా ఇరిగేషన్ అధికారుల సహకారంతో అక్రమాలకు పాల్పడుతున్న సంఘటనలున్నాయి. ఈ జలాశయం లోతట్టు వ్యాపారుల మధ్య పలుమార్లు వివాదాలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది.

విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటాం

ఎవరైనా అనుమతి లేకుండా చిల్లకర్ర, మట్టి తోడుకునే ప్రసక్తే లేదు. ప్రస్తుతం అక్రమ మట్టి తరలింపు, కలప కొట్టుకోవడానికి ఎలాంటి అనుమతులు లేవు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటాం.

– ఆర్.వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ ఈఈ, ఆత్మకూరు

పాత 5 పైసల నాణేనికి అరకేజీ చికెన్



చికెన్ కొనుగోలుతో పోగైన ఐదు పైసల నాణేలు



చికెన్ కొనుగోలుకు క్యూలైన్‌లో ఉన్న మహిళలు



దుకాణం ముందు ఏర్పాటు చేసిన ప్రచార బోర్డు

- బారులుతీరిన వినియోగదారులు

ఆత్మకూరు: 'పాత 5 పైసల నాణేనికి అర కేజీ చికెన్' ఈ బంపర్ ఆఫర్ వినేందుకు ఆశ్చర్యంగా ఉందా! అయితే ఇది నిజమే. అసలు చెల్లుబాటులో లేని ఐదు పైసలు నాణేలు వెతికి మరీ తీసుకొని వచ్చి బారులు తీరి వినియోగదారులు చికెన్ కొనుగోలు బారులు తీరారు. మహిళలు అధికంగా పాల్గొనడం విశేషం. ఆత్మకూరు పట్టణానికి చెందిన షఫీ, అహమ్మద్ పదేళ్లకు పైగా ఆత్మకూరులో చికెన్ దుకాణం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గత వారం రోజుల నుంచి ఆదివారం ఐదు పైసలకే అర కేజీ చికెన్ అంటూ దుకాణం వద్ద బోర్డు ఏర్పాటు చేశారు. ఈ ప్రచారం బాగా పలువురికి తెలియడంతో దుకాణం వద్ద ఉదయం 6 గంటల నుంచే ప్రజలు బారులు తీరారు. ఆరు గంటల నుంచి 12 గంటల వరకు కేవలం ఐదు పైసల నాణేనికి అర కేజీ చొప్పున చికెన్ ఇచ్చారు. ఈ విషయమై దుకాణ యజమానులను సంప్రదించగా గతంలో చెల్లుబాటులో ఉండే నాణేలు ఇటీవల కనుమరుగు అవుతుండడంతో వాటి విలువను తెలియజేసేందుకే ఈ ప్రయోగం చేసినట్లు, ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు.

పోల్ డే

- పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం
- పోలింగ్ సిబ్బందికి మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్
- కేటాయించిన కేంద్రాలకు తరలివెళ్లిన సిబ్బంది



కావలి: బ్యాలెట్ బాక్స్ పనితీరు పరిశీలిస్తున్న సిబ్బంది

కావలి: తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు సోమవారం పోలింగ్ జరగనుంది. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం పోలింగ్‌కు సంబంధించి బ్యాలెట్ బాక్స్‌లు, ఇతర మెటీరియల్ పంపిణీ ప్రక్రియను ఆదివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ వీకే శీనానాయక్ నేతృత్వంలో చేపట్టారు. కావలి డివిజన్ పరిధిలోని పది మండలాల పరిధిలో పోలింగ్‌కు సంబంధించిన సిబ్బంది, పోలీసులు ఆదివారం తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్లకు తరలివెళ్లారు. డీఎస్పీ ఎం.వెంకటరమణ తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్ల వద్ద శాంతి భద్రతలు కాపాడే విధంగా అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు సూచనలు తెలియజేశారు.

బాధ్యతగా విధులు నిర్వహించండి

ఆత్మకూరు: ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో పోలీసులు ప్రముఖ పాత్ర వహించాలని బాధ్యతగా విధులు నిర్వహించాలని జిల్లా ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలో ఏర్పాటు చేస్తున్న భద్రత, పోలీసుల విధులపై పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఓటర్లు స్వేచ్ఛగా ప్రశాంత వాతావరణంలో ఓటు వేసే విధంగా పోలీసులు భద్రత కల్పించాలన్నారు. ఎప్పటికప్పుడు సమాచారం ఉన్నతాధికారులకు తెలపాలని సూచించారు. ఏఏ కేంద్రాల్లో ఎన్నికల విధుల గురించి షెడ్యూల్డ్ పోలీసు అధికారులు, సిబ్బందికి తెలియజేసినట్లు ఆ మేరకు విధుల్లో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు డీఎస్పీ ఎన్.కోటారెడ్డి, సీఐలు ఎం నాగేశ్వరరావు, రవినాయక్, వివిధ మండలాల ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు సిద్ధం

ఉదయగిరి: ఎమ్మెల్సీ ఎన్నికల కీలక పోలింగ్ ఘట్టం మరి కొన్ని గంటల్లో ప్రారంభం కానుంది. ఉదయగిరి నియోజకవర్గంలో పట్టభద్రులు 8,806 ఓట్లు ఉన్నాయి. దీనికి సంబంధించి ఎనిమిది మండలాల్లో 11 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయల నుంచి 492 ఓట్లు ఉన్నాయి. వీటికి ప్రతి మండల కేంద్రంలో ఒక్కొక్క సెంటర్ ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రానికి పోలింగ్ సిబ్బంది ఆయా కేంద్రాలకు చేరుకున్నారు. ఎలాంటి సమస్య తలెత్తిన పోలింగ్ సజావుగా జరిగేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది.

కేంద్రాలకు చేరుకున్న పోలింగ్ సిబ్బంది

సంగం: సోమవారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ సిబ్బంది జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మూడు కేంద్రాలకు చేరుకున్నారు. ఆత్మకూరు పాలిటెక్నిక్ కళాశాలలో నుంచి ఎన్నికల సామగ్రిని తీసుకుని పోలింగ్ కేంద్రాలకు చేరారు. ఎన్నికల ఏర్పాట్లను తహసీల్దారు లక్ష్మీప్రసన్న పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

వరికుంటపాడు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దారు అబ్దుల్ హమీద్, ఎంపీడీఓ విజయభాస్కర్‌రావు, ఎస్సై బాలమహేంద్రనాయక్ తెలిపారు. ఆదివారం పాఠశాల్లో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి సూచనలు అందించారు. పోలింగ్ కేంద్రం వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

సోమశిల: సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి సర్వం సిద్ధం చేసినట్లు అనంతసాగరం తహసీల్దారు అన్నదాత వెంకటరమణరావు తెలిపారు. అనంతసాగరం ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఆత్మకూరు సీఐ నాగేశ్వరరావు, ఎస్సై సంతోష్‌కుమార్ రెడ్డి, రాజేష్ పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

అనుమసముద్రంపేట: సోమవారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటించాలని ఏఎస్‌పేట ఎస్సై నరేష్ తెలిపారు. ఆదివారం ఏఎస్‌పేటలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ను, అక్కడి వసతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ ముగిసేంత వరకు పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. 20 మంది పోలీసులతో ఎన్నికల పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి

జలదంకి: స్థానిక ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తహసీల్దార్ సీహెచ్ పద్మావతి, ఎంపీడీఓ ఎం.శ్రీధర్‌బాబు తెలిపారు. ఆదివారం సాయంత్రం పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఒక పోలింగ్ కేంద్రం, పట్టభద్రులకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

చేజర్ల: చేజర్లలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి చేసిన ఏర్పాట్లను ఆదివారం తహసీల్దార్ శివకృష్ణయ్య పరిశీలించారు. ఏమైనా ఇబ్బందులు ఎదురైతే పోలింగ్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్‌లో సంప్రదించాలని ఆయన కోరారు. ఏ ఇబ్బంది లేకుండా సర్వం సిద్ధం చేశామన్నారు. ఎన్నికల ఏర్పాట్లను సీఐ రవినాయక్ ఆదివారం పరిశీలించారు.

ఏర్పాట్లు సర్వం సిద్ధం

అల్లూరు: సోమవారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అల్లూరులోని రామకృష్ణ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లను రెవెన్యూ సిబ్బంది సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఆర్ఐలు సుధీర్, విష్ణుతేజ, వీఆర్వోలు రంతుల్లా, సలాం, కరిముల్లా, పుల్లారావు, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

కలిగిరి: కలిగిరిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం ఇన్‌చార్జి తహసీల్దార్ మురళీధర్, ఎంపీడీఓ ఆర్.కళాధర్‌రావు దగ్గర ఉండి పనులను పర్యవేక్షించారు. కలిగిరి సీఐ సాంబశివరావు, ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

మర్రిపాడులో..

మర్రిపాడు: మర్రిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు సిద్ధం చేశారు. పోలింగ్‌కు అంతరాయం లేకుండా బారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. పోలింగ్‌కు అవసరమైన ఎన్నికల సామగ్రిని బందోబస్తుతో సెక్టార్ ఆఫీసర్ లక్ష్మణ్‌నాయక్, తహసీల్దార్ హేమంత్ కుమార్ అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఎస్సై విశ్వనాథ్‌రెడ్డి నేతృత్వంలో ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.



కావలి: పోలింగ్ బూత్‌లో విధుల నిర్వర్తించే సిబ్బంది



ఆత్మకూరు: పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు



ఉదయగిరి: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది



చేజర్ల: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ రవినాయక్



మర్రిపాడు: పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు చూస్తున్న సెక్టార్ ఆఫీసర్, తహసీల్దారు

క్లుప్తంగా

ముఖ మండప శిఖర ప్రతిష్ట మహోత్సవం



మండప శిఖర ప్రతిష్ట మహోత్సవం

సంగం: సంగంలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో ముఖ పండపం శిఖర ప్రతిష్ట మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ముందుగా కలిశానికి పూజలు నిర్వహించి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ముఖ మండపానికి శిఖర ప్రతిష్ట చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

కలపకర్ర ట్రాక్టర్ పట్టివేత



ఇరిగేషన్ అధికారులు స్వాధీనం చేసుకున్న కలపకర్ర ట్రాక్టరు

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం జలాశయం లోతట్టు ప్రాంతం నుంచి అక్రమంగా (చిల్లకర్ర) కలప తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్థానిక జలవనరులశాఖ సిబ్బంది శనివారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. జలాశయం లోతట్టు ప్రాంతం నుంచి కలప అక్రమంగా తరలిస్తున్నారని ఉన్నతాధికారులకు సమాచారం అందడంతో ఇరిగేషన్ ఈఈ ఆదేశాల మేరకు సిబ్బంది లోతట్టు ప్రాంతానికి వెళ్లి కలపను తరలించేందుకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని ఇరిగేషన్ కార్యాలయానికి తరలించారు. కలప ఎన్ని టన్నుల ఉందో తెలియదు. పోలీసులకు అప్పగించలేదు.

కిడ్నీ వ్యాధిగ్రస్తురాలికి ఆర్థికసాయం



కిడ్నీ బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న సురేష్

కొండాపురం: కొండాపురంలోని సాయిపేట పంచాయతీ యర్రబాలెంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఎం. సరోజినీకి ఆదివారం కాకర్ల సురేష్ రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందించాడు. అదే గ్రామానికి చెందిన కొమ్మి చిరంజీవికి రూ.20 వేలు అందజేశారు. ఆయన వెంట కొమ్మి ప్రభాకర్, హరిబాబు, నరసింహులు, చంద్రబాబు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అచ్చమాంబ పొంగళ్లు

మర్రిపాడు: మండలంలోని పొంగూరు మాలిచెలో కొలువైన అచ్చమాంబ పేరంటాళ్ల ఆలయం వద్ద ఆదివారం ఘనంగా పొంగళ్లు పెట్టారు. మహిళలు ఉపవాసాలు ఉండి మొక్కులు చెల్లించుకున్నారు. పూజారి వెంకటేశ్వర్లు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం వేళ భజనలు, సాంస్కతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

ఆకతాయికి చెప్పు దెబ్బలు

కావలి: అర్ధరాత్రి వేళల్లో అసభ్యకరమైన సందేశాలు పంపిస్తూ వేధిస్తున్న ఆకతాయి యువకుడిని పట్టుకొని ఓ నర్సు ధైర్యంగా చెప్పుతో చెంపలు వాయించింది. కావలిలో జరిగిన ఈ ఘటన వీడియో ఆదివారం సోషల్ వైరల్ అయింది. కావలి పట్టణంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్న యువతి ఇంటికి సమీపంలో ఉండే యువకుడు ఆమె ఇన్‌స్టాగామ్‌కు అసభ్యకరమైన మెసేజ్‌లు పెడుతున్నాడు. తనకు పెడుతున్న మెసేజ్‌లను స్క్రీన్ షాట్ తీసి పెట్టుకున్న ఆమె, అతను ఎవరనేది గుర్తించింది. సదరు యువకుడు పనిచేస్తున్న టీ స్టాల్ వద్దకు వచ్చి అతడ్ని చొక్కా పట్టుకొని బయటకు ఈడ్చుకొచ్చిన యువతి చెప్పుతో కొట్టి దేహశుద్ధి చేసింది. అయితే స్థానికులు గుమికూడి ఆ యువతికి సర్ది చెప్పారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిసింది.

14,15న యోగాసన, సూర్యనమస్కారాల పోటీలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14,15 తేదీల్లో మహిళలకు యోగాసన, సూర్య నమస్కారాల పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, సెట్నెల్ సీఈఓ డీ పుల్లయ్య ఆదివారం తెలిపారు. ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉదయం 7 గంటలకు పోటీలు జరుగుతాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సూచనలు, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, ఇతర ప్రభుత్వశాఖల సమన్వయంతో నిర్వహిస్తున్న పోటీల్లో మహిళలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.